క్లుప్తంగా

మంత్రిని కలసిన నూతన ఎస్పీ



మంత్రి వేణును మర్యాద పూర్వకంగా కలసిన కోనసీమ ఎస్పీ శ్రీధర్

రామచంద్రపురం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఎస్.శ్రీధర్ రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణను మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో కలిసిన ఎస్పీ శ్రీధర్ పుష్పగుచ్ఛం అందజేసి జిల్లా శాంతి భద్రతలపై మంత్రి వేణుతో కొద్దిసేపు మాట్లాడారు.

మంత్రి వేణును కలసిన కాకినాడ ఎస్పీ

రామచంద్రపురం: కాకినాడ జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఎస్.సతీష్‌కుమార్, రాష్ట్ర బీసీ సంక్షేమం శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణను పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రి వేణు ఎస్పీ సురేష్‌కుమార్‌తో కొద్దిసేపు జిల్లా పరిస్థితులపై మాట్లాడారు.

వేంకటేశ్వరస్వామికి జన్మనక్షత్ర పూజలు

కపిలేశ్వరపురం: అంగరలోని గోదాదేవి సమేత, వైభవ వేంకటేశ్వరస్వామి జన్మ నక్షత్రం శ్రవణా నక్షత్ర పూజలను శనివారం ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు బాలబాలాజీ పర్యవేక్షణలోని పండితులు స్వామికి పంచామృత అభిషేకం చేశారు. గ్రామంతో పాటు పడమర ఖండ్రిక, కోరుమిల్లి, టేకి, కపిలేశ్వరపురం, తాతపూడి, నల్లూరు, వెదురుమూడి గ్రామాల భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. జగపతి, ఆదిలక్ష్మి దంపతుల ఆర్థిక సౌజన్యంతో స్వామిని విశేషంగా పూలతో అలంకరించారు.

ద్వారపూడిలో చలివేంద్రం

మండపేట: మండలంలోని ద్వారపూడిలో పంచాయతీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక బస్ షెల్టర్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆ పంచాయతీ సర్పంచ్ ఈతకోట కిన్నెర ప్రారంభించారు. వేసవి ముగిసే వరకూ చలివేంద్రాన్ని కొనసాగిస్తామని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ తులా శేషారావు, పీఏసీఎస్ చైర్మన్, గ్రామ అధ్యక్షుడు దంతులూరి శ్రీరామవర్మ, నాయకులు సుబ్బరాజు, ఆలీషా పాల్గొన్నారు.

సేవలే లక్ష్యంగా ఉచిత వైద్య శిబిరాలు

మండపేట: మండలంలోని అర్తమూరులో వైద్య సేవలను అందించడమే లక్ష్యంగా ఎస్‌బీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు కృషి చేస్తోందని ట్రస్టు చైర్మన్ సత్తి బులిస్వామిరెడ్డి అన్నారు. ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని బులిస్వామిరెడ్డి ప్రారంభించారు. రాజమహేంద్రవరానికి చెందిన డాక్టర్ అల్లు రామలింగయ్య ప్రభుత్వ హోమియో వైద్యశాల వైద్యులు రోగులకు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు వైస్ చైర్మన్ సత్తి లక్ష్మణరెడ్డి, కన్వీనర్ తాడి కోదండ రామారెడ్డి, ఉద్దగిరి ఆంజనేయులు, వెలగల శివారెడ్డి, తాడి సుబ్బారెడ్డి, గొలుగూరి సత్యనారాయణ రెడ్డి, తాడి శ్రీనివాసరెడ్డి, చింతా వెంకటకృష్ణారెడ్డి, సత్తి సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు

వి.సావరంలో ఆర్డీవో తనిఖీ

రాయవరం: మండలంలోని వి.సావరం గ్రామంలో శనివారం రామచంద్రపురం ఆర్డీవో సింధుసుబ్రహ్మణ్యం పర్యటించారు. గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న హెచ్‌పీ గ్యాస్ గొడౌన్‌ను ఆమె తనిఖీ చేశారు. హెచ్‌పీ గ్యాస్ యజమాని కురుపూడి శ్రీమన్నారాయణ ఆర్డీవోకు అనుమతి పత్రాలు చూపించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్యాస్ గొడౌన్ నిర్మాణం చేపట్టారా? లేదా? అనే అంశాన్ని ప్రధానంగా పరిశీలించారు. తనిఖీల్లో ఆమె వెంట రాయవరం తహసీల్దారు కేజే ప్రకాష్‌బాబు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఘనంగా శ్రీనివాస కల్యాణం

మండపేట: మండలంలోని తాపేశ్వరం అతిథి ప్రాంగణంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శనివారం శ్రీనివాస కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామిని పూలతో విశేషంగా అలంకరించారు. స్వామిని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దర్శించుకున్నారు.

ఎంపీటీసీ మాజీ సభ్యుడు 'పంచికట్ల' మృతి



కపిలేశ్వరపురం: కోరుమిల్లి ఎంపీటీసీ మాజీ సభ్యుడు, జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు పంచికట్ల సోమేశ్వరరావు శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. హైదరాబాద్‌లో తన నర్సరీ నిర్వహణ పనిలో ఉండగా హఠాన్మరణం పొందారు. కోరుమిల్లిలో అంత్యక్రియలు నిర్వహించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయన మృతికి పలువురు ప్రజాప్రతినిధులు, బీసీ సంఘం నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

మట్టి పరీక్షలపై అవగాహన అవసరం

- ఏడీఏ జయరామలక్ష్మి
- భూసార పరీక్షలపై శిక్షణ



యనమదలలో మట్టి నమూనాలు సేకరిస్తున్న గ్రామ వ్యవసాయ సహాయకులు

రామచంద్రపురం రూరల్: భూసారాన్ని పెంచుకునేందుకు మట్టి పరీక్షలు ఎంతో అవసరమవుతాయని రైతులకు అవగాహన చేసి ఆ దిశగా చైతన్యం తీసుకురావాలని రామచంద్రపురం సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్ జయరామలక్ష్మి వ్యవసాయాధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులకు సూచించారు. మండలంలోని వెల్ల గ్రామంలో మండల వ్యవసాయాధికారి ఎస్.సత్యప్రసాద్ ఆధ్వర్యంలో 'మట్టి పరీక్ష-శిక్షణా వారం' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో వేసవిలో తీయబోయే మట్టి నమూనాల సేకరణపై గ్రామ వ్యసాయ సహాయకులకు ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మట్టి నిర్మాణం, వాటి భౌతిక రసాయన జీవలక్షణాలు, గురించి వివరించార. జిల్లా శిక్షణలో పాల్గొన్న గ్రామ వ్యవసాయ సహాకులు మండలంలోని మిగిలిన వ్యవసాయ సహాయకులకు మట్టి నమూనాల సేకరించే విధానం గురించి వివరించారు. అనంతరం మండలంలోని యనమదలలో మట్టి నమూనా సేకరణను ప్రత్యక్షంగా పొలంలోకి వెళ్లి చేయటం జరిగింది. వెల్ల సర్పంచ్ వీరబోయిన సూరిబాబు, ఎంపీటీసీ సభ్యులు చిక్కాల చినకాపు, మంచం శ్రీదేవి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శీలం రమణ, యనమదల సర్పంచ్ పీపీ రమణ, రైతులు పాల్గొన్నారు.

కె.గంగవరం: గ్రామంలో శనివారం మట్టి నమూనాల సేకరణ, భూసార పరీక్షణపై మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో రామచంద్రపురం ఏడియా కె. జయరామలక్ష్మీ మాట్లాడుతూ ప్రతి రైతు తమ చేలో ఉన్న మట్టిని భూసార పరీక్షలు చేయించుకునే విధంగా వ్యవసాయ శాఖ సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. మట్టినమూనాలను సేకరించి భూసార పరీక్షలు చేయడం వల్ల మట్టిలో ఉన్న సమస్యలు తెలుసుకోవడం జరుగుతుందని తద్వారా సమస్య పరిష్కారానికి ఎరువులు వాడడం వల్ల భూసారం పెరిగి తెగుళ్ల నివారించడంతో పాటు రైతులకు మేలు జరుగుతుందన్నారు. మండల వ్యవసాయ సలహా కమిటి చైర్మన్ ఇళ్లా సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రస్తుతం ఆర్‌బీకేల వద్ద అపరాల సాగుకు అవసరమైన మినుములు, పెసర విత్తనాలు అందుబాటులో ఉన్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏఓ సత్యప్రసాద్, వీఏఏలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి

కాజులూరు: రాష్ట్రంలో రైతు సంక్షేమానికి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ గుత్తుల బుల్లిరాజు అన్నారు. గొల్లపాలెం రైతుభరోసాకేంద్రంలో శనివారం వీఏఏ శిరీషా అధ్యక్షతన వ్యవసాయ సలహామండలి సభ్యుల సమావేశం నిర్వహించారు. బుల్లిరాజు మాట్లాడుతూ వైఎస్సార్ ఆశయ సాధనలో భాగంగా సీఎం రైతుల కోసం ప్రతి గ్రామంలోనూ ఆర్బీకేలను పెట్టి రైతులకు అనేక సూచనలు, సలహాలు అందించేందుకే గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో వ్యవసాయ సలహామండళ్లను నియమించారన్నారు. ప్రభుత్వ పథకాలు రైతులకు సక్రమంగా అందించేందుకు, వ్యవసాయ రంగానికి నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు, రైతు ఆదాయాన్ని రెట్టింపు చేసేందుకు ఈ కమిటీ దోహదపడుతుందన్నారు. అనంతరం కరప ఏడీఏ కె.బాబూరావు మాట్లాడుతూ వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మట్టిపరీక్షలు చేపడుతున్నామని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి



యంత్రాలను పొందిన రైతులు, ప్రజాప్రతినిధులతో ఎమ్మెల్సీ తోట

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- రైతు గ్రూపులకు సబ్సిడీపై యంత్ర పరికరాలు

మండపేట: రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. వైయస్సార్ యంత్ర సేవా పథకంలో భాగంగా మండపేటలోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయం వద్ద అర్తమూరుకు చెందిన శ్రీ అయ్యప్ప సీహెచ్ గ్రూపునకు చెందిన రైతులకు రూ.12 లక్షల విలువైన ఒక ట్రాక్టర్, మూడు పవర్ టిల్లర్లను పంపిణీ చేశారు. ట్రాక్టరుకు రూ.2 లక్షలు, పవర్ టిల్లర్‌కు రూ.70 వేలు సంఘానికి రాయితీతో ప్రభుత్వం అందించిందన్నారు. ఈ యంత్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ తోట సూచించారు. కార్యక్రమంలో అర్తమూరు సర్పంచ్ గొలుగూరి అన్నపూర్ణ, మండల మాజీ ఉపాధ్యక్షులు విజయభాస్కరరెడ్డి, మండల వ్యవసాయాధికారి కె.ఏసుబాబు, రైతులు పాల్గొన్నారు.

19న దివ్యాంగుల రాష్ట్ర మహాసభ

మండపేట: ఈనెల 19న దివ్యాంగుల రాష్ట్ర స్థాయి మహాసభను తిరుపతిలో నిర్వహించనున్నట్టు సంఘం నాయకులు శనివారం తెలిపారు. పట్టణ దివ్యాంగుల భవనంలో శనివారం వారు మాట్లాడుతూ తిరుపతి పట్టణంలో దివ్యాంగుల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో మహాసభ జరుగుతుందన్నారు. మహాసభ కరపత్రాన్ని పోరాట సమితి జిల్లా అధ్యక్షులు షేక్ నబి, సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర నాయకులు, ధూలి జయరాజు శనివారం మండపేటలో ఆవిష్కరించారు.

సాగు సలహాలు శాస్త్రీయంగా ఉండాలి



మాచర సాగు సలహా మండలి సమావేశంలో చర్చిస్తున్న తహసీల్దార్, ఏఓ



వి.సావరంలో మట్టి నమూనాలను సేకరించే విధానంపై శిక్షణ ఇస్తున్న ఏవో ప్రభాకర్

కపిలేశ్వరపురం: సాగు సలహామండలి ద్వారా రైతులకు అందే సలహాలు శాస్త్రీయంగా ఉండాలని మండల సాగు సలహామండలి చైర్మన్ పుట్టా కృష్ణమూర్తి, తహసీల్దార్ కొమరం సూర్యారావు అన్నారు. మాచరలో కృష్ణమూర్తి అధ్యక్షతన శనివారం నిర్వహించిన మండలి సమావేశంలో వ్యవసాయ సాగు పరిస్థితిని ఏఓ కేవీఎస్ రమేష్‌కుమార్ వివరించారు. 2022-23 రబీ ధాన్యం కొనుగోలు కోసం ఆర్బీకేల్లో గోనె సంచులను అందుబాటులో ఉంచామని ఏఓ తెలిపారు. ధాన్యం తరలించిన అనంతరం మిల్లు వద్ద ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు చేపడుతున్నామన్నారు. సమావేశంలో సాగు సలహా మండలి సభ్యులు మేడిశెట్టి దుర్గారావు, నక్కా సింహాచలం, పీఏసీఎస్ చైర్మన్ కరెడ్ల శ్రీనివాసుబాబు పాల్గొన్నారు.

పోషకాలు తెలుసుకునేందుకే మట్టి పరీక్షలు

రాయవరం: భూమిలో పోషకాలు ఎంత మోతాదులో ఉన్నాయో తెలుసుకునేందుకు రైతులంతా మట్టి పరీక్షలు చేయించుకోవాలని ఏవో కొప్పిశెట్టి ప్రభాకర్ సూచించారు. మండలంలోని వ్యవసాయ సహాయకులకు శనివారం మట్టి పరీక్షలపై క్షేత్రస్థాయి శిక్షణ నిచ్చారు. ఈ సందర్భంగా ఏవో ప్రభాకర్ మాట్లాడుతూ మట్టి పరీక్షల ఫలితాలతో ఎకరం చేనుకు నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులు ఎంత మోతాదులో వేయాలి, సూక్ష్మ పోషకాలైన జింకు, బోరాన్ ఎంత మోతాదులో వేయాలో తెలుసుకునే వీలుంటుందన్నారు. మనం పండించే భూమిని సంరక్షించుకోవడానికి రసాయన ఎరువులతో పాటు, సేంద్రియ ఎరువులు కూడా అవసరమన్నారు. సేంద్రియ ఎరువులు కూడా ఎంత మోతాదులో వేయాలి, సేంద్రియ ఎరువులు భూమిలో ఎంత వరకు ఉన్నాయో తెలుసుకోవడానికి మట్టి నమూనాల పరీక్షలు అవసరమవుతాయన్నారు. అనంతరం మండల వ్యవసాయ సహాయకులకు వి.సావరంలో మట్టి నమూనాల సేకరణపై అవగాహన కల్పించారు. మట్టి నమూనాలు తీసుకునేటప్పుడు ఒక ఎకరం పొలంలో ఐదు చోట్ల జెడ్ ఆకారంలో తీయాలన్నారు. చెట్ల నీడలో, గట్ల దగ్గర మట్టి నమూనాలు సేకరించకూడదన్నారు. వరికోతలు పూర్తయిన వెంటనే ప్రతి గ్రామం నుంచి నాలుగు శాంపిల్స్‌ను సేకరించి, మండలానికి 50 శాంపిల్స్ తీసుకుని మట్టి పరీక్ష కేంద్రానికి పంపించాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సిరికి కృష్ణారావు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

వెదురుమూడిలో పూలే విగ్రహం ఏర్పాటు

- సద్దుమణిగిన సమస్య
- చొరవ చూపిన వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీలు కుడిపూడి, తోట



వెదురుమూడిలో పూలే విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్సీలు కుడుపూడి, తోట

కపిలేశ్వరపురం: మండలంలోని వెదురుమూడిలో శుక్రవారం జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలోని కొందరు అనుమతి లేకుండా ఈ నెల 11న విగ్రహాన్ని నెలకొల్పారు. అనుమతులు లేనందున చట్ట పరిధిలో పోలీసులు, పంచాయతీ, రెవెన్యూ అధికారులు ఆ విగ్రహాన్ని తొలగించి భద్రపర్చారు. ఘటనపై గ్రామ, మండల శెట్టిబలిజ సంఘాల పెద్దలు చర్చలు జరిపి విషయాన్ని ఎమ్మెల్సీ తోట త్రిమూరులు దృష్టికి తీసుకెళ్లారు. విగ్రహాన్ని అధికారులు తొలగించిన రోజునే విగ్రహం పునః ప్రతిష్ఠ చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాగా శుక్రవారం శెట్టిబలిజ సంఘం నాయకులు, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ, తోట త్రిమూర్తులు వెదురుమూడి వచ్చి సంఘ పెద్దలతో మాట్లాడారు. పెద్దల సమక్షంలో విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. విగ్రహానికి ఎమ్మెల్సీలు కుడుపూడి, తోట పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, వైస్ ఎంపీపీ గుణ్ణం భానుప్రసాద్, వైఎస్సార్ సీపీ గ్రామ నాయకులు బోడే వెంకటేశ్వరరావు, బోడే సూరిబాబు, మండల శెట్టిబలిజ సంఘం నాయకులు శీలం గోవింద్, మేడిశెట్టి దుర్గారావు, వాసంశెట్టి వాసు, సంఘం పెద్దలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే పార్టీకి శ్రీరామరక్ష



కుయ్యేరులో స్టిక్కర్లు పంచి ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తున్న నాయకులు

కాజులూరు: రాష్ట్రంలో సీఎం జగన్ అందిస్తున్న సంక్షేమ పథకాలే పార్టీకి శ్రీరామరక్ష అని, వాటిని ఉపయోగించు కోవటంలో ప్రజలలో సరైన అవగాహన కల్పించటం ద్వారా మరోసారి వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకు రాగలమని కుయ్యేరు సర్పంచ్ పిల్లి కృష్ణమూర్తి అన్నారు. శనివారం కుయ్యేరులో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని నిర్వహించారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో ఇంటింటికీ వెళ్లి నాడు-నేడు ప్రభుత్వ పాలనలో వ్యత్యాసాలను వివరిస్తూ పార్టీ నుంచి వచ్చిన ప్రశ్నపత్రంలోని ఐదు ప్రశ్నలకు జవాబులు రాబడుతూ ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. స్టిక్కర్లు, కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో మండల గృహసారథుల కమిటీ చైర్మన్ చింతపల్లి నాగేంద్రప్రసాద్, ఎంపీటీసీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలే ముఖ్యం

రామచంద్రపురం: అగ్నిప్రమాదాల నివారణకు ముందస్తుగా తీసుకోవాల్సిన చర్యలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రామచంద్రపురం అగ్నిమాపక అధికారి ఎస్.నాగేశ్వరరావు సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా పలు ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. వైఎస్సార్ నగర్‌లో ప్రజలను అగ్నిప్రమాదాలు సంభవించకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలతో పాటుగా ప్రమాదాలు జరిగినప్పుడు ఏ విధంగా ఉండాలనేదానిపై సూచనలు చేశారు. ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు అగ్నిప్రమాదాలపై అవగాహన చేశారు. ప్రధాన కూడళ్లలో మైక్‌ల ద్వారా ప్రచారం చేస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈనెల 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు అగ్నిమాపక అధికారి నాగేశ్వరరావు తెలిపారు.

సీనియర్ సివిల్ జడ్జిని కలిసిన బార్ అసోసియేషన్



సీనియర్ సివిల్ జడ్జి మాధవీదేవిని కలిసిన బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

రామచంద్రపురం: ఇటీవల నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు సీనియర్ సివిల్ జడ్జి కె.మాధవీదేవిని మర్యాద పూర్వకంగా కలిశారు. కోర్టు ఆవరణంలో శనివారం బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు పిల్లి మురళీమోహన వెంకటరమణ, కార్యదర్శి వాడ్రేవు సాయిప్రసాద్, సంయుక్త కార్యదర్శి వీర్రెడ్డి, కోశాధికారి చక్రవర్తి, మహిళా జూనియర్ న్యాయవాదుల ప్రతినిధులు సత్యవాణి, పృథ్వీ, సీనియర్ న్యాయవాదులు దొమ్మలపాటి సత్యనారాయణ, బులుసు వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొని పుష్పగుచ్ఛం అందజేశారు. సీనియర్ సివిల్ జడ్జి మాధవీదేవి నూతన కార్యవర్గాన్ని అభినందించారు. మే 13న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని న్యాయమూర్తి మాధవీదేవి న్యాయవాదులను కోరారు.

20వ వార్డులో ప్రజా ప్రతినిధుల పర్యటన



లబ్ధిదారులతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ నూక దుర్గారాణి

మండపేట: పట్టణంలోని 20వ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, షేక్ అండ్ షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ ఆలీఖాన్ బాబా, పట్టణ జేఏసీ కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు పర్యటించారు. జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్ళి ప్రభుత్వ పథకాలను వివరించారు. కుటుంబంలో పొందిన లబ్ధిని తెలుసుకున్న లబ్ధిదారులు తమ ఇంటి గోడకు మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు అతికించుకున్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు టేకి, మాచర, తదితర గ్రామాల్లో శనివారం పర్యటించారు. ఇంటింటికీ వెళ్ళి ప్రతి కుటుంబానికి ప్రభుత్వం నుంచి అందిన లబ్ధిని వివరించారు. లబ్ధిదారుల సమ్మతిపై వారి ఇంటి గోడకు మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్‌లు అతికించారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఇసుక ర్యాంపులో అక్రమాలంటూ విమర్శ

కపిలేశ్వరపురం: మండలంలోని తాతపూడి ఇసుక ర్యాంపులో అక్రమాలు సాగుతున్నాయని టీడీపీ ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ళ లీలాకృష్ణ విమర్శించారు. వీరిద్దరూ శనివారం ర్యాంపును సందర్శించారు. గోదావరిలో సహజ వనరైన ఇసుకను పరిరక్షించేందుకు తాను హైకోర్టును ఆశ్రయించానని జనసేన నాయకుడు లీలాకృష్ణ తెలిపారు. ర్యాంపులో వేసిన బాటను తొలగించాలని హైకోర్టు ఆదేశించినప్పటికీ అధికారులు స్పందించలేదన్నారు. ఎమ్మెల్యే వేగుళ్ళ మాట్లాడుతూ ర్యాంపులో తవ్వకాలు జరుగుతున్నాయా లేదా అన్న తన ప్రశ్నకు తహసీల్దార్ సూర్యారావు పొంతన లేని సమాధానాలు చెబుతున్నారంటూ అసహనం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



సాయికుమార్‌రెడ్డి (ఫైల్)

రామచంద్రపురం రూరల్: ఇద్దరు యువకులు బైక్‌పై నడిచి వెళుతున్న వ్యక్తిని ఢీకొట్టిన సంఘటన శనివారం సాయంత్రం రామచంద్రపురం మండలం వెంకటాయపాలెంలో చోటు చేసుకుంది. ఈ సంఘటనలో మోటారు సైకిల్ నడుపుతున్న యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, నడిచి వెళుతున్న వ్యక్తి, బైక్‌పై వెనుక కూర్చున్న యువకుడు గాయాల పాలయ్యారు. ద్రాక్షారామ ఎస్సై బి.వినోద్ సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మృతి చెందిన యువకుడు రామచంద్రపురం మండలంలోని భీమక్రోసుపాలేనికి చెందిన పెనుమళ్ల సాయికుమార్‌రెడ్డి (24), వెనుక కూర్చున్న యువకుడు అదే గ్రామానికి చెందిన బిళ్లకుర్తి ఉదయ్‌కుమార్‌రెడ్డిలు కాగా, నడిచి వెళుతున్న వ్యక్తి చొల్లంగి వెంకటరమణది అమలాపురం సమీప గ్రామంగా చెబుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వినోద్ తెలిపారు.

భీమక్రోసుపాలెంలో విషాద ఛాయలు..

ఇదిలా ఉండగా సాయికుమార్‌రెడ్డి తల్లిదండ్రులు పెనుమళ్ల శ్రీహరి కృష్ణారెడ్డి, మహాలక్ష్మిలు వృద్ధాప్యంలో ఉండి కుమారుడిపై ఆధారపడి జీవిస్తున్నారు. లేకలేక కలిగిన మగ సంతానం కావడంతో గారాబంగా పెంచుకున్నారు. సాయికుమార్‌రెడ్డి ఒంగోలులో ఒక హేచరీలో పని చేస్తూ తల్లిదండ్రులను పోషించుకుంటున్నాడు. ఇద్దరు తోబుట్టువులకు వివాహం జరిగింది. అతడే తల్లిదండ్రులకు అండగా ఉంటున్నాడు. సాయికుమార్‌రెడ్డి మృతితో భీమక్రోసుపాలెంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ప్రశాంతంగా ముగిసిన 'పది' పరీక్షలు

రాయవరం: పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో నాలుగు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసిన విషయం పాఠకులకు విదితమే. ఈ నెల మూడు నుంచి ప్రారంభమైన పదో తరగతి పరీక్షలను రాయవరం శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో రెండు, పసలపూడి, చెల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. చివరగా శనివారం నిర్వహించిన సోషల్ పరీక్షకు 463 మంది ఇంగిషు మీడియం, 199 మంది తెలుగు మీడియంలో పరీక్షలు రాశారు. ఐదుగురు విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు. చీఫ్ సూపరింటెండెంట్లుగా డి.సత్తిరాజు, పి.వెంకటేశ్వరరావు, పోలిశెట్టి రాంబాబు, వి.శాంతి సునీత, డీవోలుగా డి.జోసఫ్‌కుమార్, డి.త్రిమూర్తులు, ఆర్.శ్రీనివాసు, ఏఎస్‌టీ వెంకటేశ్వరరావు వ్యవహరించారు. టెన్త్ పరీక్షలు ముగియడంతో విద్యార్థులంతా పరీక్ష కేంద్రాల నుంచి సంతోషంగా బయటకు వెళ్లడం కన్పించింది. వివిధ పాఠశాలల నుంచి వచ్చి పరీక్షలు రాసిన విద్యార్థులు ఈ పది రోజుల్లో స్నేహితులుగా మారగా ఒకరికొకరు వీడ్కోలు చెప్పుకుంటూ వెళ్లడం కన్పించింది.





